నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హాజరుకానున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట/నర్మెట/తరిగొప్పుల, అక్టోబర్ 18 : బచ్చన్నపేట మండలం బండ నాగారం, కొడవటూరు, నర్మెట మండలం బొమ్మకూరు, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బీఆర్ఎస్ బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాల అధ్యక్షులు బొడిగం చంద్రారెడ్డి, చింతకింది సురేశ్, పింగళి జగన్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి చిలువేరు లింగం తెలిపారు. శుక్రవారం ఆయా మండలాల్లో వారు విలేకరులతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఆయా మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, సోషల్‌మీడియా, అన్ని అనుబంధ సంఘాల బాధ్యులు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

దేవరుప్పుల మండల వ్యవసాయాధికారిగా దివ్య

దేవరుప్పుల, అక్టోబర్ 18: మండల వ్యవసాయాధికారిగా బజ్జూరి దివ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రెండున్నరేళ్ల క్రితం నాటి మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ బదిలీపై వెళ్లగా అప్పటి నుంచి ఇన్‌చార్జిల పాలన కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఏవోగా బజ్జూరి దివ్య బాధ్యతలు చేపట్టడంతో రైతులకు ఉపయోగంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలో ఐదుగురు ఏఈవోలు ఉన్నా, ఏవో పోస్టులో నిన్నటి వరకు ఇన్‌చార్జిలు ఉండడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. ఏవో నియామకంతో ఉపయోగంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ఘనంగా బండా ప్రకాశ్ పుట్టిన రోజు వేడుకలు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18 : శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గోరంట్ల యాదగిరి ఆధ్వర్యంలో శివునిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివునిపల్లి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు బూర్ల శంకర్, ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు పిట్టల అనిల్, శివలింగం, మత్స్య పారిశ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నూరి వెంకటేశ్వర్లు, కొండ వేణు, పాఠశాల సిబ్బంది భూపాల్, భాస్కర్‌కుమార్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సభ్యత్వం ఇస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

నర్మెట, అక్టోబర్ 18: ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని హన్మంతాపూర్, కన్నెబోయినగూడెం, వెల్దండ, అమ్మాపూర్, గండిరామవరం, ఆగాపేట పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను కలిసి అభినందించారు. అనంతరం యూనియన్ సభ్యత్వాన్ని వారికి అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయిలో ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు, ప్రతి పాఠశాలకు హెచ్ఎం, బోధనేతర సిబ్బంది ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ రాజు, కార్యదర్శి కొయ్యడ శ్రీరాములు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ కనకయ్య, శ్రీనివాస్, దూడల రమేశ్, మోసిన్, నరహరి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

జఫర్‌గఢ్, అక్టోబర్ 18 : మండలంలోని వడ్లెగూడేనికి చెందిన ఇల్లందుల పెద్ద ఐలయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరోవైపు జఫర్‌గఢ్‌కు చెందిన రిటైర్డ్ ఆర్డీసీ డ్రైవర్ ఎండీ అన్వర్‌తోపాటు, ఉప్పుగల్లులో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను కడియం శ్రీహరి పరామర్శించారు. అందరికీ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, నాయకులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్ అన్ని వసతులతో. Contact: 8106340199.
NT-333076

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

శివునిపల్లిలోని పత్తి మిల్లును పరిశీలిస్తున్న దేవేందర్

పత్తి మిల్లును పరిశీలించిన అగ్నిమాపక శాఖ ఎస్సై

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18 : మండలంలోని శివునిపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని శ్రీ శివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌ను ఫైర్‌స్టేషన్ ఎస్సై ఎన్ దేవేందర్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా ఆదేశాల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శాఖ వాహనం వెళ్లేలా సౌకర్యంగా ఉందా, అత్యవసరంగా మంటలు ఆర్పడానికి ఏర్పాట్లు చేశారా అనే అంశాలను పరిశీలించినట్లు దేవేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పత్తి మిల్లు యజమాని మనోహర్ (మధు), అగ్నిమాపక సిబ్బంది సురేందర్, గణేశ్ పాల్గొన్నారు.

30 రోజుల్లో పెండింగ్ కేసులను పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను 30 రోజుల్లో పరిష్కారించేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరెట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ల్యాండ్, అట్రాసిటీస్ సమస్యలపై ఎస్సీ సంక్షేమ, కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్, గిరిజన శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, కమిషన్ సభ్యులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి నెల వ్యవధిలో పెండింగ్ కేసులు లేకుండా వివిధ శాఖల అధికారులు కసరత్తు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టం మీద భయం, రాజ్యాంగం పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. మొక్కుబడిగా కాకుండా యాక్షన్ ప్లాన్ ప్రకారం సివిల్ రైట్స్‌డే రోజు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్య తేవాలన్నారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకోసారి ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీలకు సమాన గౌరవం దక్కేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎస్సీ జనాభా 18 శాతం ఉండగా, ఎస్టీ జనాభా 22 శాతం ఉందన్నారు. జనగామ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా 19 శాతం, ఎస్టీ జనాభా 8 శాతం, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా 25 శాతం, ఎస్టీ జనాభా 8 శాతం ఉందని వివరించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించిన చెల్లింపుల విషయంలో ఆలస్యం లేకుండా కేసు ఫైళ్లకు టోకెన్ జనరేట్ చేసి చెల్లింపు కోసం ప్రణాళిక రూపొందించామన్నారు. నిర్దేశిత సమయంలో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ సమస్యను చర్చించి వాటి పరిష్కార దిశగా వివిధ శాఖల అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతినెల చివరి వారంలో అన్ని మండలాల్లో సివిల్ రైట్స్‌డే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, లక్ష్మీనారాయణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీటీడీవో ప్రేమకళ, ఏసీపీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శివునిపల్లి విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18 : మండలంలోని శివునిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుసుమ రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ కొండ రవి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో 9వ తరగతికి చెందిన బీ ఇందు, జీ ప్రసన్న, 8వ తరగతికి చెందిన బానోత్ హర్షవర్ధిని, 7వ తరగతికి చెందిన జీ అంకిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వారు తెలిపారు. ఈనెల 19, 20 తేదీల్లో వరంగల్ నగరం ఏనుమాముల మార్కెట్ వద్ద గల ఇన్ ఫంట్ జీసస్ పాఠశాలలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భగత్, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జ్యోతి, పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు జొన్నల రాజేశ్వర్ అభినందించారు..

22న జనగామలో నిరుద్యోగులకు జాబ్ మేళా

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎం మల్లయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌కు చెందిన కంపెనీల్లో ఉద్యోగాల కోసం నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికట్స్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూలు 22న ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతాయని ఆయన వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

కాపర్ వైర్ చోరీ జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జఫర్‌గఢ్, అక్టోబర్ 18 : మండలంలోని ఏబీతండా శివారులోని వ్యవసాయ బావుల వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతు బానోత్ దేవేందర్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ బావుల వద్ద గల 25 హెచ్‌పీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పేర్కొన్నారు. దీనిపై విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. కాపర్‌వైర్‌ను చోరీ చేసిన వారిని గుర్తించిన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యతోపాటు కళలకు ప్రాధాన్యమిస్తే ఉద్యోగ అవకాశాలు

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

కళోత్సవంలో విద్యార్థులతో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కళాఉత్సవ్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల ఉపాధ్యాయ విద్యా కళాశాలలో జిల్లాస్థాయి కళాఉత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం విద్యాశాఖ అధికారి రాముతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోపాటు కళారంగంలో రాణిస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, విజువల్ ఆర్ట్స్, సాంప్రదాయక కథ చెప్పడం వంటి విభాగాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. జిల్లా స్థాయి విజేతలు నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ బీ శ్రీనివాస్, డీసీఇబీ కార్యదర్శి చంద్రభాను, న్యాయ నిర్ణేతలు మల్లికార్జున్, వీరంజని, డీసీఇబీ సహాయ కార్యదర్శి రామరాజు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : వైద్య శాఖకు సంబంధించిన అన్ని అంశాల్లో వంద శాతం పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యశాఖకు సంబంధించి వివిధ అంశాలపై అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రోజుకు రెండు పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో ఓపీ, గర్భిణీ నమోదు వంటి అంశాల్లో మెరుగైన సేవలు అందేలా సమీక్షించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు సబ్ సెంటర్ సిబ్బందితో సమీక్ష జరిపి అన్ని అంశాల్లో పురోగతి తేవాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో 15 సంవత్సరాలలోపు విద్యార్థులను ఆర్‌బీఎస్‌కే బృందం క్షుణ్ణంగా పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులపైన నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరగాలని ఆయన కోరారు. ప్రతి పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్ సుధీర్, డాక్టర్ శ్రీధర్, డీఐవో డాక్టర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

శ్రీరాముడి కీర్తనలతో మార్మోగిన బమ్మెర

రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

పాలకుర్తి, అక్టోబర్ 18 : తిరుమల తిరుపతి దేవస్థానం వారి సూచనలమే రకు శ్రీరామదాసు భజన మండలి, పోతన భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బమ్మెరలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో భక్తులు శ్రీరాముడి కీర్తనలను ఆలపించారు. భజన మండలి సభ్యులు సోమసత్యం, బొల్లం మల్లేశ్ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించి సన్మార్గంలో పయనించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.మూడు రోజుల పాటు భగవద్గీతపై వ్యాఖ్యానం నిర్వహించినట్లు వివరించారు.

గ్రూప్స్ పరీక్షలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో టీఎస్‌పీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో గ్రూప్స్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, ఏసీపీ పార్థసారథి పాల్గొన్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల కోసం జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలని, దీనిని శనివారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల ధృవీకరణ పూర్తయిన అనంతరం అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణ ప్రారంభిస్తామన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాలోని ఒక ప్రాంతంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు రీజినల్ కో-ఆర్డినేటర్లను నియమించాలన్నారు. గ్రూప్-3 పరీక్షకు మూడు పేపర్లు, గ్రూప్-2 పరీక్షకు నాలుగు పేపర్లు ఉంటాయని, రీజినల్ కో-ఆర్డినేటర్ పరిధిలో స్ట్రాంగ్ రూం గుర్తించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5,616 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, తెలిపారు. కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసి, పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

మన్‌పహాడ్‌లో టిప్పర్ సీజ్

దేవరుప్పుల, అక్టోబర్ 18: మండలంలోని మన్‌పహాడ్‌లో ఓ వ్యవసాయ క్షేత్రం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మన్‌పహాడ్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. మట్టి నింపి ఉన్న టిప్పర్‌ను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేవని తేలడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. భూగర్భ గనుల శాఖ అనుమతులు ఉండాలని, అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని సృజన్‌కుమార్ స్పష్టం చేశారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

క్రీడా పోటీల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పింకేశ్‌కుమార్ రెండు రోజుల పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నదని, ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో రూ.380 కోట్లు కేటాయించారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను మరింత అభివృద్ధి చేసి క్రీడాకారులను గుర్తించాల్సిన బాధ్యత ప్రతి వ్యాయమ ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. 2028లో జరిగే ఒలింపిక్స్‌కు జిల్లా నుంచి క్రీడాకారులంతా సన్నద్ధం కావాలని సూచించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్యతోపాటు మానసిక వికాసానికి క్రీడలు అవసరమన్నారు. మండల స్థాయిలో విజయం సాధించి, జిల్లా స్థాయికి వచ్చిన ప్రతి క్రీడాకారుడిలో ప్రతిభ ఉన్నట్లైనని, జిల్లా స్థాయిలో ఓడినంత మాత్రాన బాధపడొద్దన్నారు. ఓటమి రేపటి గెలుపునకు నాందిగా భావించాలని ఆయన సూచించారు. అనంతరం ఎంఎల్ఏ శ్రీహరి, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి 72 మంది బాలురు, 72 మంది బాలికలు హాజరయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలైన క్రీడాకారులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ఎంపికైన వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, జిల్లా విద్యాశాఖ డీసీఈబీ సెక్రటరీ చంద్రబాను, జిల్లా యువజన, క్రీడా అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ పాండు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల జోనల్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, డీసీఈబీ సహాయ కార్యదర్శి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లావణ్యారెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18 : మండలంలోని శివునిపల్లిలో శ్రీ శివ సాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యాశిరీష్‌రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లతో కలిసి ఆమె ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. సీసీఐ కేంద్రాల్లోనే పత్తికి మద్దతు ధర లభిస్తుందన్నారు. పత్తిని తీసుకొస్తున్న రైతులు తమ ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు. నాణ్యమైన క్వింటాల్ పత్తికి రూ.7,521 ధర లభిస్తుందన్నారు. పత్తిలో తేమను 8 శాతం మించకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. దళారులకు పత్తిని విక్రయించి నష్టపోకూడదని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్, సీసీఐ ఇన్‌చార్జి బత్తుల తిరుపతిరెడ్డి, శ్రీ శివసాయి కా